కొవ్వూరులో ఓటింగ్‌కు ఇద్దరు దూరం

కొవ్వూరు రూరల్:స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో కొవ్వూరు ఎంపిడిఒ కార్యాలయంలో పోలింగ్ కేంద్రంలో 242 మందికి 240 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 99.17 శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల సరళిని సహాయ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, భద్రతా ఏర్పాట్లను అదనపు ఎస్‌పి ఎం.రజని, కొవ్వూరు డిఎస్‌పి వివిఎన్.వర్మ పరిశీలించారు. ఎన్నికల జోనల్ అధికారి, ఏలూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ.సత్యనారాయణ ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఓటింగ్ పూర్తి అయిన తరువాత అధికారుల సమక్షంలో బ్యాలెట్ బాక్సుకు సీల్ వేసి, పోలీసు భద్రత మధ్య ఏలూరు తరలించారు.

ఓటేయని వారు వీరే

నిడదవోలు మున్సిపాల్టీకి చెందిన 12వ వార్డు కౌన్సిలర్ మేడపాటి సరిత, నల్లజర్ల మండలం తెలికిచర్లకు చెందిన ఎంపిటిసి సభ్యులు తాడిపర్తి మంగ ఓటు హక్కు వినియోగించుకోలేదు. మొత్తం ఎన్నికల ప్రక్రియను రాజమండ్రి జిల్లా కలెక్టర్ మాధవీలత ప్రత్యక్షంగా పర్యవేక్షించారు.

ప్రశాంతంగా ఎంఎల్‌సి పోలింగ్

భీమవరంలో బారులు తీరిన ఓటర్లు

98.46 శాతం ఓటింగ్ నమోదు

1,105 ఓట్లకుగాను పోలైనవి 1,088

ఓటు హక్కు వినియోగించుకున్న 15 మంది ఎంఎల్‌ఎలు

ఓటు వేయని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు

ఓటర్ల తరలింపుపై అధికార పార్టీ ఎంఎల్‌ఎలు ప్రత్యేక శ్రద్ధ

భారీ బందోబస్తు నడుమ పోలింగ్ ప్రక్రియ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ ముగిసే సమయానికి మొత్తం 98.46 శాతం ఓటింగ్ నమోదైంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 1,105 మంది స్థానిక ప్రజాప్రతినిధులు ఓటర్లుగా ఉండగా 1,088 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 496 మంది ఉండగా 592 మంది మహిళలు ఉన్నారు. ఏలూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 249 మంది ఓటర్లకుగాను 246 మంది (98.80 శాతం) తమ ఓటుహక్కు వినియోగించుకోగా వారిలో 108 మంది పురుషులు, 138 మంది మహిళలు ఉన్నారు. జంగారెడ్డిగూడెం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 184 మంది ఓటర్లకుగాను 180 మంది (97.83 శాతం) తమ ఓటుహక్కును వినియోగించుకోగా వారిలో 84 మంది పురుషులు, 96 మంది మహిళలు ఉన్నారు. కొవ్వూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 242 మంది ఓటర్లకుగాను 240 మంది (99.17 శాతం) తమ ఓటుహక్కును వినియోగించుకోగా వారిలో 107 మంది పురుషులు, 133 మంది మహిళలు ఉన్నారు. నర్సాపురం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 229 మంది ఓటర్లకుగాను 227 మంది (99.13 శాతం) తమ ఓటుహక్కును వినియోగించుకోగా వారిలో 103 మంది పురుషులు, 124 మంది మహిళలు ఉన్నారు. భీమవరం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 201 మంది ఓటర్లకుగాను 195 మంది (97.01 శాతం) తమ ఓటుహక్కును వినియోగించుకోగా వారిలో 94 మంది పురుషులు, 101 మంది మహిళలు ఉన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఐదు పోలింగ్ కేంద్రాల్లో సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటల వరకు సాగింది. ఈ పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు పర్యవేక్షించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు ఆయన తెలిపారు. ఏలూరు జిల్లా పరిధిలో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ ప్రశాంతి, ఎస్‌పి యు.రవిప్రకాష్ పరిశీలించారు.



భీమవరం పోలింగ్ కేంద్రంలో ఎన్నికల పరిశీలకులు, జిల్లా కలెక్టర్ పరిశీలన

ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చిన ఎంఎల్‌ఎలు

తమ నియోజకవర్గాల పరిధిలోని ఓటర్లను అధికార పార్టీ ఎంఎల్‌ఎలంతా దగ్గరుండి మరీ పోలింగ్ కేంద్రాలకు తీసుకొచ్చారు. వారితోపాటు ఎంఎల్‌ఎలు ఓటేసి వెళ్లారు. ఏలూరు పోలింగ్ కేంద్రంలో మాజీ మంత్రి, ఏలూరు ఎంఎల్‌ఎ అళ్ల నాని, ఎంఎల్‌ఎలు అబ్బాయిచౌదరి (దెందులూరు), పుప్పాల వాసుబాబు (ఉంగుటూరు), జంగారెడ్డిగూడెంలోని పోలింగ్ కేంద్రంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎంఎల్‌ఎలు తెల్లం బాలరాజు (పోలవరం), ఎలిజా (చింతలపూడి) ఓటు వేశారు. కొవ్వూరు పోలింగ్ కేంద్రంలో మంత్రి తానేటి వనిత, ఎంఎల్‌ఎలు శ్రీనివాసులు నాయుడు (నిడదవోలు), తలారి శ్రీను (గోపాలపురం) ఓటేయగా భీమవరంలో శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ, ఎంఎల్‌ఎలు గ్రంధి శ్రీనివాస్ (భీమవరం, మంతెన రామరాజు (ఉండి), నరసాపురంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజు, ఎంఎల్‌ఎలు నిమ్మల రామానాయుడు (పాలకొల్లు), చెరుకువాడ రంగనాథరాజు (ఆచంట), ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు, ఎంఎల్‌సి పాందువ్వ శ్రీను ఓటు వేయలేదు.

ఓట్ల చీలికపై తర్జనభర్జనలు

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో మొత్తం 1,105 ఓట్లుకుగాను 888 ఓట్లు వరకూ వైసిపికి ఉన్నాయి. 217 ఓటర్లు ప్రతిపక్షాలకు చెందినవారు ఉన్నారు. వైసిపికి రెండు ఎంఎల్‌సి స్థానాలు ఏకగ్రీవంగా కావాల్సి ఉండగా టిడిపి మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులు బరిలో నిలవడంతో ఎన్నిక అనివార్యమైంది. ఓట్లు చీలే అవకాశం ఉండటంతో అధికారపార్టీ తమ స్థానిక ప్రజాప్రతినిధులకు సైతం ఓటుకు రూ.20 వేలు, కొవ్వూరు నియోజకవర్గంలో వెండి, సెల్‌ఫోన్లు వంటివి సైతం పంపిణీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా ప్రతిపక్ష పార్టీల ఓటర్లను సైతం ప్రలోభపెట్టి ఓటు వేయించే ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. ఇన్ని చర్యలు తీసుకున్నప్పటికీ ఓట్ల చీలికపై ఇంకా వైసిపిలో అనుమానాలు నెలకొన్నాయి. రెండో ప్రాధాన్యత ఓటు పక్కాగా వైసిపి అభ్యర్థులకు పడిందా లేక టిడిపి మద్దతుదారులకు వేశారా అనే చర్చ వైసిపిలో నడుస్తోంది.

మధ్యాహ్నానికి దాదాపు పోలింగ్ పూర్తి

ఉదయం ఎనిమిది గంటలకు ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటల వరకూ సాగింది. మధ్యాహ్నం సమయానికే దాదాపు పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. ఆ తర్వాత ఒకరిద్దరు ఓటర్లు మాత్రమే పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు అనుమతించలేదు. ఓటు హక్కు వినియోగించుకున్న వారికి సిరా మార్క్ వేయలేదు. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో సిరా మార్క్ వేసే నిబంధన లేదని అధికారులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్లు

పోలింగ్ కేంద్రం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోల్ కానివి	ఓటింగ్‌శాతం
జంగారెడ్డిగూడెం	184	180	4	97.83
కొవ్వూరు	242	240	2	99.17
నరసాపురం	229	227	2	99.13
ఏలూరు	249	246	3	98.80
భీమవరం	201	195	6	97.01

బ్యాలెట్ బాక్సులు ఏలూరు ఎంపిడిఒ కార్యాలయానికి తరలింపు

జిల్లాలోని ఐదు పోలింగ్ కేంద్రాల్లోని బ్యాలెట్ బాక్సులను ఏలూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు అధికారులు తరలించారు. ఈ నెల 16న కౌంటింగ్ జరగనుంది. అందుకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు దృష్టి సారించారు.



ఓటేస్తున్న డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ

ఓటేసిన చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

ఓటేసిన మాజీ మంత్రి చెరుకువాడ రంగరాజు

ఓటేసిన ఎంఎల్‌ఎ నిమ్మల, ఎంఎల్‌సి అంగర

భీమవరం నుంచి ఏలూరు తరలిస్తున్న బ్యాలెట్ బాక్స్

విజయం ఖాయం

ఎంఎల్‌సి అభ్యర్థి వంక రవీంద్రనాథ్

ముఖ్యమంత్రి పరిపాలన, అందిస్తున్న సంక్షేమ పథకాలు, స్థానిక ఎంఎల్‌ఎల కృషి ఫలితంగా మా విజయం ఖాయం.

నమ్మించి మోసగించారు

ఎంఎల్‌సి అభ్యర్థి కవురు శ్రీనివాస్

2014-2019 మధ్య జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో వైసిపికి చెందిన ఇద్దరు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. అయితే అప్పట్లో టిడిపి పెద్దలు ఏకగ్రీవ ఎన్నికకు సహకరించాలని కోరడం, మాకు ఎలా బలం లేదని మా అభ్యర్థులను పోటీ నుంచి తప్పించాం. ప్రస్తుతం వైసిపి నుంచి నాతోపాటు వంక రవీంద్రనాథ్ పోటీలో ఉండగా గత ఎన్నికల మాదిరిగానే ఈసారి తమకు సహకరించాలని తమ పార్టీ పెద్దలు స్వతంత్ర అభ్యర్థులకు మద్దతు పలికిన పార్టీ పెద్దలతో మాట్లాడారు. నామినేషన్లు విత్‌డ్రా చేయిస్తామని చెప్పిన వారు చివరి వరకూ చేస్తున్నామంటూ చెప్పి మోసగించారు. ఇది చూసి ఆ పార్టీ ఓటర్లే మాకు అనుకూలంగా ఓటు వేస్తున్నారు. అందరి సహకారంతో మేం విజయం సాధించబోతున్నాం.

స్థానిక ఎంఎల్‌సి పోరు ప్రశాంతం

భీమవరంలో మధ్యాహ్నానికే ఓటేసిన 195 మంది

ఓటింగ్‌కు ఆరుగురు దూరం

పోలింగ్ కేంద్రానికి ఒక్కసారిగా పోటెత్తిన ఓటర్లు

ఓటుహక్కు వినియోగించుకున్న మండలి ఛైర్మన్ మోషేన్‌రాజు, డిప్యూటీ సిఎం కొట్టు, ఎంఎల్‌ఎలు

పోలింగ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ ప్రశాంతి, ఎన్నికల పరిశీలకులు సురేష్‌కుమార్, ఎస్‌పి రవిప్రకాష్

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మధ్యాహ్నం భోజన సమయానికే అనూహ్యరీతిలో పోలింగ్ ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. ఈ పోలింగ్ కేంద్రం పరిధిలో తాడేపల్లిగూడెం, భీమవరం, ఉండి, అత్తిలి నియోజకవర్గాలకు చెందిన ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, కౌన్సిలర్లు కలిపి 201 మంది ఓటర్లుండగా మధ్యాహ్నం రెండు గంటల సమయానికి 195 ఓట్లు పోలయ్యాయి. ఉదయం ఎనిమిది గంటలకే పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ తొమ్మిది గంటలకు కేవలం రెండు ఓట్లే పోలయ్యాయి. అనంతరం పోలింగ్ ఊపందుకుంది. మధ్యాహ్నం రెండు గంటలు దాటిన తర్వాత 195 ఓట్లు పోలయ్యాయి. సాయంత్రం నాలుగు గంటలకు పోలింగ్ పూర్తయ్యేసరికి 97.50 శాతం ఓటింగ్ నమోదైంది. ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖుల్లో శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, భీమవరం, ఉండి ఎంఎల్‌ఎలు గ్రంధి శ్రీనివాస్, మంతెన రామరాజు ఉన్నారు. ఎంఎల్‌సి మంతెన సత్యనారాయణరాజు (పాందువ్వ శ్రీను), ఇద్దరు జెడ్‌పిటిసిలు, ముగ్గురు ఎంపిటిసిలు ఓటు హక్కును వినియోగించుకోలేదు. ఎంఎల్‌సి అభ్యర్థులు వంక రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు సురేష్‌బాబు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో మొదటి ఓటును స్వతంత్ర అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్ భార్య, వీరవాసరం ఎంపిపి దుర్గాభవాని వినియోగించుకోగా చివరిగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వేశారు. పటిష్టమైన బందోబస్తు నడుమ ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

ప్రతిపక్షాలకు చెంపపెట్టుగా ఫలితం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల ఫలితం ప్రతిపక్ష పార్టీలకు చెంపపెట్టుగా ఉండబోతుందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వాఖ్యానించారు. భీమవరంలో ఓటు హక్కును వినియోగించుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర శ్రేయస్సు కోసం సంక్షేమాన్ని అందిస్తున్న వైసిపి ప్రభుత్వంపై బురద జల్లుతున్నారన్నారు. ప్రజలకు న్యాయం జరగకుండా అడ్డుకుంటున్నారన్నారని ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికైనా అభివృద్ధికి సహకరించాలని, లేకపోతే ప్రజలు క్షమించరని హెచ్చరించారు.

స్వతంత్ర అభ్యర్థులకు మద్దతు వారి విజ్ఞతకే వదిలేస్తున్నాం

గ్రంధి శ్రీనివాస్, ఎంఎల్‌ఎ, భీమవరం

గత ఎంఎల్‌సి ఎన్నికల్లో వైసిపికి బలం లేకపోవడంతో పోటీ చేయలేదని, అయితే ఈ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులకు కొన్ని పార్టీలు మద్దతు పలుకడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని భీమవరం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఓటు హక్కు వినియోగించుకన్న అనంతరం గ్రంధి మాట్లాడుతూ టిడిపి పోటీలో లేకపోయినప్పటికీ స్వతంత్ర అభ్యర్థులకు మద్దతు పలుకడం విలువలు కోల్పోయిన వారిలా మిగిలిపోయారని విమర్శించారు.

ప్రశాంతంగా పోలింగ్

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. భీమవరంలో పోలింగ్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, ఎఎస్‌పి సుబ్బరాజు, భీమవరం డిఎస్‌పి శ్రీనాథ్ పరిశీలించారు. భీమవరం పోలింగ్ కేంద్రానికి భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు ఇన్‌ఛార్జిగా వ్యవహరించగా మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, భీమవరం తహశీల్దార్ వై.రవికుమార్ పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షించారు.

భీమవరం రూరల్: స్థానిక ఎంపిడిఒ కార్యాలయానికి వెళ్లే రంగ బొమ్మ సెంటర్లో, అటు సిఐటియు కార్యాలయ సమీపంలో బారికేడ్లు ఏర్పాటు చేసి అక్కడ నుంచి ఓటర్లను మాత్రమే అనుమతించారు. ఓటర్ల ఐడెంటిటి కార్డును గుర్తించాకే పోలింగ్ బూత్ వరకు అనుమతించారు. ఆ పరిధిలో దుకాణాలన్నీ మూసివేశారు.

నరసాపురంలో ప్రశాంతం

యలమంచిలి: స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలు నరసాపురంలో ప్రశాంతంగా ముగిశాయి. నరసాపురం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తొలుత మందకొడిగా పోలింగ్ సాగినా తర్వాత ఒక్కసారిగా ఊపందుకుని మధ్యాహ్నం రెండు గంటలకే 98 శాతం ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ ఎంఎల్‌సి అభ్యర్థి కవురు శ్రీనివాస్‌తోపాటు రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎంఎల్‌ఎ ముదునూరి ప్రసాదరాజు, ఎంఎల్‌ఎలు చెరుకువాడ శ్రీరంగనాథరాజు (ఆచంట), నిమ్మల రామానాయుడు (పాలకొల్లు), ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 229 మంది ఓటర్లకుగాను నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు, పెనుగొండ మండలం సిద్ధాంతం ఎంపిటిసి కలగా ప్రసాద్ మినహా మిగిలిన వారంతా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల పరిశీలకులు రమేష్ కుమార్, కలెక్టర్ పి.ప్రశాంతి, నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఎస్‌పి యు.రవిప్రకాష్ పోలింగ్‌ను పరిశీలించారు.

భారీ మెజార్టీతో వైసిపి అభ్యర్థుల గెలుపు

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

వైసిపి ఎంఎల్‌సి అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. నరసాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓడిపోతామని తెలిసి కూడా టిడిపి నేతలు కొంతమంది అభ్యర్థులను బరిలో నిలిపి ఎన్నికలకు కారణమయ్యారన్నారు.

వైసిపి పని అయిపోయింది

పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

ఎంఎల్‌సి ఎన్నికల్లో అధికార పార్టీ వైసిపి ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ కుట్రలు చేసి గెలుపొందడానికి ప్రయత్నించడం దారుణమని పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఒకపక్క 175కి 175 సీట్లు మావే అంటున్న ముఖ్యమంత్రి జగన్‌కు అంత విశ్వాసం ఉంటే రాత్రికి రాత్రే ఒక్కో ఓటర్‌కు రూ.20 వేలు, వెండి గ్లాసులు ఎందుకు పంపిణీ చేశారని ప్రశ్నించారు. దీన్నిబట్టి వైసిపి నేతలకు తమ పార్టీ వారిపైనే విశ్వాసం లేదని, భవిష్యత్తులో వారు ఓటమి పాలవటం ఖాయమని అంగీకరించనట్లేనని విమర్శించారు.

పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన మంత్రులు, అభ్యర్థులు

భీమవరంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని మంత్రులు, ఎంఎల్‌ఎలు సందర్శించారు. అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంక రవీంద్రనాథ్‌తోపాటు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహారాజు పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి పరిశీలించారు.

భీమవరంలో ఓటింగ్‌కు ఆరుగురు దూరం

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఆరుగురు ఓటు హక్కును వినియోగించుకోలేదు. ఆకివీడు, పాలకోడేరు జెడ్‌పిటిసిలు మంతెన వెంకట్రాజు, పెద్దిశెట్టి లక్ష్మీతులసి, ఆకివీడు మండలం దుంపగడప ఎంపిటిసి పి.సూర్యనారాయణరాజు, అత్తిలి మండలం అత్తిలి-4 ఎంపిటిసి తండా జ్యోతి, టిడిపి ఎంఎల్‌సి మంతెన వెంకట సత్యనారాయణరాజు (పాందువ్వ శ్రీను), కాళ్ల మండలం దొడ్డనపూడి ఎంపిటిసి జి.సత్యనారాయణ వివిధ కారణాలతో తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు.

నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం

ఎన్నికల నిబంధనలను అధికారపక్షం ఉల్లంఘించింది. భీమవరంలో ఏర్పాటు చేసిన ఎంఎల్‌సి ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన అయినా ఓటుహక్కును వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లను నాకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆకివీడుకు మండలానికి చెందిన ఓటర్లను నా పేరు వంక రవీంద్ర, ఎంఎల్‌సి అభ్యర్థిగా పోటీలో ఉన్నానని, తప్పనిసరిగా ఓటు వేస్తే గెలుపొందాక అన్నివిధాలా సహకరిస్తానని, చేతులు జోడించి ఓట్లను అభ్యర్థించారు. ఈ తతంగమంతా పోలింగ్ కేంద్రం ఎదుట అధికారుల ముందు జరుగుతున్న వారు చూస్తూ ఉండిపోయేరే తప్ప నోరు మెదపలేదు. వంక రవీంద్రనాథ్‌తోపాటు భీమవరం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఓట్లు అభ్యర్థించడం గమనార్హం.

స్వతంత్ర అభ్యర్థికే నా ఓటు

ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని ముఖ్యోద్దేశంతో ఎన్నికలు బహిష్కరించినప్పటికీ స్వతంత్ర అభ్యర్థిగా ఉన్న వీరవల్లి చంద్రశేఖర్‌కు ఓటు వేశానని ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. భీమవరంలో ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో పరిషత్ ఎన్నికలను బహిష్కరించామని గుర్తు చేశారు. అయినా నామినేషన్ టిడిపి నేతలు కొంతమంది గెలుపొందారని, ప్రస్తుత ఎంఎల్‌సి ఎన్నికలనూ బహిష్కరించామని, స్వతంత్ర అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్‌కు మద్దతు ప్రకటించామని చెప్పారు.

97.50 శాతం పోలింగ్ నమోదు

భీమవరం పోలింగ్ కేంద్రం పరిధిలో భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం, అత్తిలి నియోజకవర్గాలకు చెందిన 201 మంది జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, కౌన్సిలర్లు ఓటర్లుగా ఉన్నారు. వీరిలో 195 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిసేటప్పటికి 97.50 శాతం ఓటింగ్ నమోదైంది. ఓటు హక్కు వినియోగించుకున్న 195 మందిలో 101 మంది మహిళలు, 94 మంది పురుషులు ఉన్నారు.

5న చలో ఢిల్లీ జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఉపాధి హామీ చట్ట పరిరక్షణకు వచ్చేనెల ఐదో తేదీన చేపడుతున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు పిలుపునిచ్చారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సిఐటియు, కౌలురైతు సంఘం పిలుపులో భాగంగా సోమవారం ఇరగవరం మండలం కావలిపురంలలో ఉపాధి హామీ కూలీలతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీకి గత ఏడాది బడ్జెట్‌లో రూ.89 వేల కోట్లు కేటాయిస్తే ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. కేంద్రంలో మోడీ అధికారంలోకి రాకముందు రూ.410 ఉన్న గ్యాస్ ధర రూ.1200 పెంచారని, గ్రామీణ పేదలకు ఎంతో ఉపయోగపడుతున్న ఉపాధి హామీ నిధుల్లో కోత పెట్టడం పేదల పొట్టకొట్టడమేన్నారు. ఇప్పటికే గ్రామాల్లో వ్యవసాయరంగంలో వచ్చిన మార్పుల ఫలితంగా పనులు లేవని, ఈ తరుణంలో ఉపాధి హామీ పనులు కీలకంగా మారా యన్నారు. అలాగే పాతపద్ధతిలోనే మస్తర్ వేసేలా చూడాలని, కనీస వేతనం రోజుకు రూ.600, 200 రోజులు పని కలఇపంచాలని కోరారు.

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, కార్మిక హక్కుల చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తెచ్చిన విధానానికి వ్యతిరేకంగా కౌలు రైతులకు యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులిచ్చి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భావన సంజీవరావు, వీరవల్లి సీతామహాలక్ష్మి, కుక్కల సుధారాణి, కనిపే నాగకుమారి, వాసంశెట్టి గంగరాజు, కేతా శ్రీను, ఓలేటి చంద్ర, కనిపే బాబూరావు పాల్గొన్నారు.

ఐదో రోజుకు కలెక్టరేట్ ఉద్యోగుల నిరసన

భీమవరం:తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకూ నిరసన కొనసాగిస్తామని భీమవరం కలెక్టరేట్ ఉద్యోగులు స్పష్టం చేశారు. ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఉద్యోగులు చేపట్టిన నిరసన సోమవారానికి ఐదో రోజుకు చేరింది. దీనిలో భాగంగా కలెక్టరేట్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సిపిఎస్ రద్దు చేసి పాత విధానాన్ని అమల్లోకి తేవాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి బకాయిలు ఇవ్వాలని, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, సచివాలయాల్లో ఉద్యోగులకు లక్ష్యాలను తొలగించి పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వై.దుర్గాకిషోర్, వివి.పెద్దిరాజు, సాంబశివరావు, జగన్మోహన్, కె.సురేష్, కళ్యాణి, సాయి, పృథ్వీ, సుభాష్, గంగాధర్‌రావు, సూర్యకాంతం, అనురాధ, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆక్వా సాగులో నిబంధనలు మీరితే చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

పర్యావరణానికి హాని కలిగించే ఆక్వా సాగును వ్యవసాయ, ఉద్యానవన సాగుతో పోల్చుకోవద్దని నిబంధనలకు విరుద్ధంగా ఉంటే కచ్చితంగా నిలుపుదల చేయాల్సిందేనని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో మత్స్యశాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. ఆక్వా సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ఆలోచన చేయకుడదని మత్స్య అధికారులకు హితవుపలికారు. వ్యవసాయ, ఉద్యానవన పంటలు ద్వారా ప్రకృతికి మేలు చేకూరుతుందన్నారు. జిల్లాలో నిబంధనలు అతిక్రమించిన, ఇతర పంటలకు నష్టం చేకూర్చేలా ఉన్న ఆక్వా సాగును ఖచ్చితంగా నియంత్రించాలని ఆదేశించారు. ప్రతీ గ్రామ సచివాలయంలో సచివాలయం సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉన్నారా లేదా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మత్స్య శాఖకు సంబంధించిన పిటిషన్లు ఎక్కువ స్థాయిలో బియాండ్ ఎస్‌ఎల్‌ఎస్‌లో ఉంటున్నాయని ఆమె అగ్రహం వ్యక్తం చేశారు.

ఫిష్ ఆంధ్రా యూనిట్లును గ్రౌండింగ్ చేసే ప్రక్రియలో మత్స్య శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది సమిష్ట కృషితో మెరుగైన ఫలితాలు తీసుకురావాలన్నారు. ఫిష్ ఆంధ్రా యూనిట్ల గ్రౌండింగ్ నత్త నడకన సాగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెప్మా ద్వారా గుర్తించిన యూనిట్ల లబ్ధిదారులకు బ్యాంక్ అకౌంట్లను ఓపెన్ చేసి, మిగిలిన ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఫిష్ ఆంధ్రా యూనిట్స్ ఏర్పాటుకు పట్టణ ప్రాంతంలోని రెస్టారెంట్లు, నూడిల్స్ బండ్లు, బిర్యానీ పాయింట్స్ తదితర వ్యాపారులను ప్రోత్సహించాలన్నారు.

ఆక్రమణదారులకు నోటీసులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని ఏలూరుపాడు గ్రామపంచాయతీ మలుపు వద్ద రోడ్డు ఆక్రమణదారులకు పంచాయతీ అధికారులు సోమవారం నోటీసులు జారీ చేశారు. ఏలూరుపాడు గ్రామంలో ఆర్అండ్‌బి రోడ్డుకు ఆనుకుని ఆక్రమణలపై ప్రజాశక్తి ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్అండ్‌బి రోడ్డును ఆక్రమించి వ్యాపారం చేస్తున్న ఏడుగురు వ్యక్తులను గుర్తించి నోటీసులు ఇచ్చామని ఇఒఆర్‌డి ఎవి.భాస్కరరావు తెలిపారు. రెండు రోజుల్లో దుకాణాలు తొలగించాలని నోటీస్ దారులను హెచ్చరించామన్నారు. ఆక్రమణలు తొలగించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయనతో పాటు సచివాలయ గ్రామ కార్యదర్శి కె.నాగమోహిని, గ్రామ రెవెన్యూ అధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - పోడూరు

మండల స్థాయిలో యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 5వ తేదీన ఐదు, పదో తరగతి విద్యార్థులకు జరిగిన 21వ ప్రతిభా పాటవ పరీక్షా ఫలితాలను సోమవారం యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దాసరి క్షేమమూర్తి, శెట్టి నాగరాజు విడుదల చేశారు. ఐదో తరగతిలో ప్రథమ స్థానం నడివింటి రామ్‌సత్యబాలాజీ, రెండో స్థానం చికిలే శామ్యూల్, మూడో స్థానం బి.యశ్వంత్‌కుమార్, వి.ప్రీతి చందన సాధించారు. పదో తరగతి తెలుగు మీడియం విభాగంలో ప్రథమ స్థానం చదలవాడ రామలక్ష్మి జెడ్‌పి హైస్కూల్ గుమ్ములూరు, రెండో బహుమతి కేత శ్రీవల్లి జెడ్‌పి హైస్కూల్ పండితవిల్లూరు, ఇంగ్లీష్ మీడియం విభాగంలో ప్రథమ స్థానం వీరవల్లి మోహన్ ప్రియ జెడ్‌పి హైస్కూల్ కవిటం, రెండో బహుమతి వాసా దివ్యశ్రీ జెడ్‌పి హైస్కూల్ గుమ్ములూరు నిలిచారు. వీరందరికీ త్వరలో బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

జ్వరాల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - పాలకోడేరు

పరిసరాల పరిశుభ్రత, వేడి నీళ్లను తాగడం ద్వారా ఆరోగ్యాన్ని భద్రంగా ఉంచుకోవచ్చని హెల్త్ సూపర్‌వైజర్ శంకర్ అన్నారు. గొరగనమూడి గ్రామంలో ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో పాలకోడేరు పిహెచ్‌సి వైద్యులు రంగం నాయుడు సూచనలతో సోమవారం గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ గ్రామ ప్రజల ఆరోగ్య విషయాలను అడుగుతూ జ్వరాల పట్ల ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సిబ్బంది వివరించారు. జ్వరాలు రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో, దోమల నివారణను ఏ విధంగా చేయవచ్చో వారికి వివరించారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ ఎం.విజయప్రసాద్, ఎఎన్ఎం వేదకుమారి, వర్కర్లు శాంతి, కుమారి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆకివీడులో భారీ చోరీ

ప్రజాశక్తి - ఆకివీడు

మండల కేంద్రమైన ఆకివీడులో భారీ చోరీ జరిగింది. ఇంటి యజమానులు ఊరు వెళ్లారని గుర్తించిన దొంగలు ఇంటిలోకి ప్రవేశించి చోరీకి తెగబడ్డారు. బీరువాలు పగలగొట్టి బంగారం, నగదు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో జవ్వాదివారి వీధికి చెందిన వైసిపి కార్యకర్త జవ్వాది శివ తన కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల ఎనిమిదో తేదీ రాత్రి ఇంటికి తాళం వేసి తిరుపతి వెళ్లారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున నాలుగున్నరకు రైలు దిగి ఇంటికి వచ్చారు. అప్పటికే ఇంటి తాళాలు పగలుకొట్టి ఉండటంతో, చోరీ జరిగిందని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ చోరీలో పది కాసులు బంగారం, కేజీ వెండి సామగ్రి, రూ.15 వేల నగదు చోరీకి గురైనట్లు నిర్ధారించారు. ఎఎస్ఐ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. వేలిముద్రలు సేకరించారు.

గోదావరిలో దూకి వ్యక్తి గల్లంతు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని కలగంపూడి గ్రామానికి చెందిన ఇందుకూరి శ్రీనివాసరాజు (39) సోమవారం చించినాడ బ్రిడ్జిపై నుంచి గోదావరిలోకి దూకి గల్లంతయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాసరాజు కొన్నేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ వారానికి రెండుసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఆరోగ్యం సరిగాలేకపోవడంతో స్థానిక ఆర్ఎంపి వైద్యుడికి చూపించుకోగా మరొకసారి పెద్ద ఆసుపత్రికి వెళ్లి చెకప్ చేయించుకోమని సలహా ఇచ్చారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీనివాసరాజు ద్విచక్ర వాహనంపై చించినాడ బ్రిడ్జి పైకి వెళ్లి బంధువులకు ఫోన్ చేసి తాను గోదావరిలో దూకేస్తున్నానని, తన భార్యా పిల్లలను చూసుకోమని చెప్పి గోదావరిలో దూకేసినట్లు స్థానికులు చెబుతున్నారు. శ్రీనివాసరాజుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు దీనిపై యలమంచిలి పోలీసులను వివరణ కోరగా.. తమకు ఎటువంటి సమాచారం అందలేదని తెలిపారు.

వైద్యం వికటించి బాలింత పరిస్థితి విషమం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రసవం సమయంలో వైద్యం వికటించి బాలింత ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో ఆమె బంధువులు సోమవారం పట్టణంలోని పల్లవి ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. వివరాలిలా ఉన్నాయి. నరసాపురం మండలం కొప్పర్రు గ్రామానికి చెందిన పోలిశెట్టి నాగమణి(25)కి పురిటినొప్పులు రావడంతో ప్రసవం నిమిత్తం భర్త మణికుమార్, బంధువులు స్థానిక పల్లవి ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఆ సమయంలో స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో, ఆయన వీడియో కాల్‌లో సూచన మేరకు హెడ్ నర్స్‌తో డెలివరీ చేయించారని నాగమణి బంధువులు తెలిపారు. పుట్టిన బాబుని తమకు చూపించి రెండు గంటల తర్వాత నాగమణి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, విజయవాడకు తరలించాలని చెప్పడంతో అక్కడకు తరలించామన్నారు. అక్కడ వైద్యులు పరీక్షించి డెలివరీ సమయంలో అధిక రక్తస్రావం కావడం వల్ల రక్తం కేవలం మూడు శాతం మాత్రమే ఉందని, కిడ్నీలు, లివర్ పాడయ్యాయని తెలిపారు. తక్షణం డయాలసిస్ చేయాలని చెప్పి రెండుసార్లు డయాలసిస్ చేశారని కుటుంబ సభ్యులు తెలిపారు. అయినా నాగమణి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోగా మరింత క్షీణించడంతో విజయవాడ నుండి హైదరాబాద్ కిమ్స్‌కు తరలించాలని చెప్పడంతో మళ్లీ అక్కడకు తరలించామని తెలిపారు. ఇప్పటికే లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టామని, అక్కడ కూడా వైద్యులు పరీక్షించి నాగమణి ఆరోగ్యం విషమంగానే ఉందని చెప్పారని, ఈ తరుణంలో చేసేది లేక హైదరాబాదు నుండి తిరిగి భీమవరం పల్లవి ఆసుపత్రికి తీసుకొచ్చామన్నారు. ఈ నేపథ్యంలో వైద్యుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బంధువులు, గ్రామస్తులు పెద్దఎత్తున ఆసుపత్రికి చేరుకుని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న టూ టౌన్ సిఐ కె.కృష్ణకుమార్, రూరల్ సిఐ నాగప్రసాద్ ఆందోళనకారులను సముదాయించారు. నాగమణికి మెరుగైన వైద్యం చేయిస్తామని, న్యాయం జరిగేలా చూస్తామని చెప్పి అంబులెన్స్‌లో ఉన్న నాగమణిని చికిత్స నిమిత్తం వేరే ఆస్పత్రికి తరలించారు.

తాటాకిల్లు దగ్ధం

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట పంచాయతీ పరిధి చెమ్మచెరువు గ్రామానికి చెందిన బొక్క మార్తమ్మకు చెందిన తాటాకిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.50 వేల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు అధికారులు తెలిపారు. గ్రామ సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావ, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్ ఓదార్చి, బియ్యం, వంట సామగ్రి, దుప్పట్లు కొంత నగదును అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఉల్లం జ్యోతి రామాంజనేయులు, నాయకులు మనవర్తి విజయ్ కుమార్, బొక్క రామకృష్ణ దాసరి ప్రశాంత్ పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన బస్సు

పెనుమంట్ర :టిప్పర్ లారీని వెనుక నుంచి ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన నత్తా రామేశ్వరం శివారు పంపనవారిపాలెం ప్రధాన రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. అత్తిలి నుంచి మార్టేరు వెళ్తున్న టిప్పర్ లారీని ఆరంజ్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఉపాధ్యాయుల కృషి.. విద్యార్థుల సాధన

పది పరీక్షలకు ప్రత్యేక ప్రణాళికలు

అదనపు తరగతులు

జిబి.జయప్రసాదరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, లంకలకోడేరు

పాలకొల్లు రూరల్ : మండలంలోని లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొత్తం 126 మంది విద్యార్థులు ఈ సంవత్సరం పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారని ప్రధానోపాధ్యాయులు జిబి.జయప్ర సాదరావు తెలిపారు. ప్రతిరోజు ప్రత్యేక అదనపు తరగతులు నిర్వహిస్తూ వారిపై ప్రత్యేక దష్టి పెడుతున్నామన్నారు. గత సంవత్సరం 47 శాతం ఉత్తీర్ణత ఉందని, ప్రస్తుతం దానిని వంద శాతానికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నామన్నారు. తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి సలహాలు సూచనలు తీసుకుంటున్నామన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

బి.వెంకటేశ్వర్లు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, శివదేవుని చిక్కాల

పాలకొల్లు రూరల్ : శివదేవుని చిక్కాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల దృష్ట్యా పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం మొత్తం 71 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్నారన్నారు. ఇంగ్లీష్ మీడియం 50 మంది, తెలుగు మీడియం 21 మంది ఉన్నారన్నారు. ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ప్రతి నెల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి, వారి పిల్లల ప్రగతిని వారికి వివరించి వారి సూచనల మేరకు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

రామారావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, చింతపర్రు

పాలకొల్లు రూరల్ : చింతపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల కోసం ఉపాధ్యాయ బృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ప్రధాన ఉపాధ్యాయులు రామారావు తెలిపారు. ఎ, బి, సి, డి గ్రేడులుగా విద్యార్థులను విభజించి, సిడి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇంగ్లీష్ మీడియం సంబంధించి 38 మంది విద్యార్థులు, తెలుగు మీడియం సంబంధించి 28 మంది విద్యార్థులు ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. మోడల్ ప్రశ్నాపత్రాల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం

ఎం.వెంకట సత్యనారాయణ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఎన్ఆర్‌పి అగ్రహారం

ఉండి :పౌష్టికాహారం ద్వారా విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపించాలి మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకట సత్యనారాయణ అన్నారు. ప్రజాశక్తితో ముక్కు వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ దాతల సహకారంతో పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం నాలుగు గంటల తరువాత పౌష్టికా హారాన్ని అల్పాహార రూపంలో అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. తమ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు మొత్తం 41 మంది ఉన్నారని, నూటికి నూరు శాతం ఉత్తీర్ణత తమ లక్ష్యంగా విద్యార్థులను పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నామని తెలిపారు. ఎస్ఎ 1 పరీక్ష ఫలితాల ఆధారంగా విద్యార్థులను గ్రేడుల రూపంలో విభజించామని వారిలో 30 మంది విద్యార్థులు ఎ, బి గ్రేడ్లలో ఉన్నార న్నారు. 11 మంది విద్యార్థులు సిడీ గేడ్లలో ఉన్నారన్నారు. వీరికి ప్రభుత్వ ప్రణాళికతో పాటు ఉదయం సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

కొల్లి సాయిరాం, జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు,

ఉండి :ప్రత్యేక శిక్షణ తరగతుల ద్వారా మెరుగైన ఫలితాలను సాధించవచ్చని ఉప్పులూరులోని శ్రీ యర్రా చంద్రరావు, ఆండాలమ్మ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొల్లి సాయిరాం అన్నారు. 2023 పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ప్రజాశక్తితో కొల్లి సాయిరాం మాట్లాడుతూ తమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 48 మంది ఉన్నారని, వీరిలో గత పరీక్ష ఫలితాల ఆధారంగా 11 మంది విద్యార్థులు సి గ్రేడ్, డి గ్రేడ్ లో ఉన్నారని చెప్పారు. వీరికి మెరుగైన విద్యను అందించేందుకు ఉదయం 8.30 నిమిషాల నుంచి గం.9.15 నిమిషాల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. పాఠశాల విద్యాశాఖ రూపొందించిన విజయకేతనంలోని అంశాలను ప్రతి విద్యార్థితో చదివించి, విద్యాశాఖ రూపొందించిన కాల నిర్ణయం పట్టిక అమలుపరుస్తున్నట్లు కొల్లి సాయిరాం తెలిపారు.

ఎంఎల్‌సి ఎన్నికల్లో విచ్చలవిడి పంపిణీలు : సిపిఎం

ప్రజాశక్తి - ఆకివీడు

అధికార పార్టీ ప్రజాస్వామ్యాన్ని బహిరంగంగా కూని చేస్తోందని సిపిఎం నాయకులు విమర్శించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో 9వ శాఖా సమావేశం నిర్వహించారు. సిపిఎం నాయకులు బాలి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మండల కార్యవర్గ సభ్యులు పెంకి అప్పారావు పాల్గొని మాట్లాడారు. వాలంటీర్ల ద్వారా ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటర్లకు బహిరంగంగానే డబ్బు, వెండి, నాణేలు ఇతర బహుమతులు పంపిణీ చేసి ఎన్నికలను అపహాస్యం చేశారన్నారు. స్థానికంగా అనేక సమస్యలు పెరిగిపోయాయని, వాటిని ఎవరూ పట్టించుకోవట్లేదని అన్నారు. జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలకు కనీసం రూ.ఆరు లక్షలు మంజూరు చేయాలన్నారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ వలి పలు సమస్యలను ప్రస్తావించారు. ఈ సమావేశంలో శాఖా కార్యదర్శి గోపీచంద్ రాంబాబు, విజయవాడ రమణ, గొట్టాపు పెంటయ్య పాల్గొన్నారు.

నిలిచిపోయిన రేషన్ వ్యాన్ ఆపరేటర్ల జీతాలు

ప్రజాశక్తి - ఆకివీడు

ఇంటింటికి రేషన్ బియ్యం అందిస్తున్న వ్యాన్ ఆపరేటర్(ఎండియు)లకు ఫిబ్రవరి నెల జీతాలు నేటికీ అందలేదు.

బియ్యం అందిస్తున్న రేషన్ వ్యాన్ ఆపరేటర్

ప్రభుత్వం జీతాలు విడుదల చేయగా ఎండియుల వ్యాన్లకు ప్రభుత్వం చెలించాల్సిన బీమా మొత్తం చెల్లించకపోవడంతో బ్యాంకర్లు జీతాలు నిలిపివేసినట్లు ఎండియు ఆపరేటర్ల మండల అధ్యక్షులు బొడ్డుపల్లి చెన్నారావు, సంఘ నాయకుడు సతీష్ చెప్పారు. ప్రభుత్వం వీరి కోసం ఒక్కొక్కరికి ప్రతినెల రూ.18 వేల జీతం విడుదల చేస్తోంది. వాటిలో మూడు వేల రూపాయలు డీజిల్ నిమిత్తం, మరో మూడు రూ.వేలు హమాలీ కూలీ నిమిత్తం, ఒక వెయ్యి రూపాయలు అదనపు ఖర్చు నిమిత్తం ఇస్తూ 11 వేల రూపాయలు జీతంగా అందిస్తోంది. ప్రభుత్వం బీమా వాయిదా చెల్లించకపోవడంతో బ్యాంకర్లు ఈ జీతాలు ఆపేసినట్టుగా ఆపరేటర్లు చెప్తున్నారు. ప్రస్తుతం జీతాలు అందకపోవడంతో వారి కుటుంబాన్ని నిర్వహణతో పాటు గత నెల హమాలీ ఖర్చులు ప్రస్తుతం ఈ నెల హమాలీ ఖర్చులు, డీజిల్ ఖర్చులకు చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. సకాలంలో ప్రజలకు బియ్యం అందించలేని పరిస్థితి ఏర్పడుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇదే విధంగా ఒకసారి జరిగిందన్నారు. బీమా చెల్లించని సమయంలో బ్యాంకర్ల జీతాలు నిలిపివేయడంతో ప్రభుత్వం వెంటనే జీతాలు విడుదల చేయాలని ఆదేశించిందని చెప్పారు. ఇప్పుడు కూడా ఆ రకంగా తమ జీతాలు విడుదల చేయించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

ప్రజాశక్తి - కాళ్ల

నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరు కృషి చేయాలని డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. మండలంలోని పెదఅమిరం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు సోమవారం పరిశీలించారు. గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను, మెయిన్, స్పెషల్ ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. నులిపురుగుల మందులు ఆయా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు అందాయా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ డాక్టర్ డి మహేశ్వరరావు మాట్లాడుతూ 2-19 సంవత్సరాల మధ్య వయసున్న పిల్లలందరూ ఈ నెల 14వ తేదీన ఆల్బెండజోల్ మందులు వేసుకోవాలని సూచించారు. అర్హులకు ఆల్బెండజోల్ మందులు చేరేలా వైద్యులు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ రామామహేశ్వరి, పిహెచ్‌సి ఒ హరి, ఎఎన్ఎంలు మహాలక్ష్మి, రాజకుమారి, ఆశావర్కర్లు నాగదుర్గ,

పాలకొల్లు :మండలంలోని లంకలకోడేరు గ్రామం పిహెచ్‌సి పరిధిలో జాతీయ నులి పురుగులు నిర్మూలన కార్యక్రమం డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాలల్లో, జూనియర్ కళాశాలల్లో, డిగ్రీ కళాశాలల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నులిపురుగులు వల్ల రక్త హీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం తదితర లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ నులి పురుగులు నిర్మూలన కార్యక్రమంలో ఆల్బెండజోల్ 400 మిగ్రా మాత్రలు భోజనం తర్వాత వేసుకోవాలని తెలిపారు. దీని వల్ల ఎటువంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు.

ఉండి : నులిపురుగుల ద్వారా ఆరోగ్యపరమైన సమస్యలు బాగా ఎక్కువగా ఉంటాయని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పంజా ధర్మతేజ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ నులిపురుగు నిర్మూలన కార్యక్రమాన్ని ఉండి మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ, మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నులిపురుగులు ముఖ్యంగా చిన్నపిల్లలలో

కాళ్లలో...

ఎక్కువగా ఉంటాయి అన్నారు. కలుషితమైన పరిసరాలు, అపరిశుభ్రమైన వాతావరణం ద్వారా నులిపురుగులు వేగంగా విస్తరిస్తాయన్నారు. నులిపురుగుల వల్ల నీరసం, రక్తహీనత, పోషక లోపం, ఆకలి మందగించడం వంటి సమస్యలు ఏర్పడతాయన్నారు. ఒకటి నుంచి 19 సంవత్సరాల వయస్సు గలవారికి నులిపురుగు మాత్రలు ఇవ్వనున్నట్లు తెలిపారు.ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 5383 మంది ఒకటి నుంచి 19 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు ఉన్నారని, తమకు ప్రభుత్వం ద్వారా 5900 నులిపురుగు మాత్రలు వచ్చాయని ఆయన తెలిపారు.

బొండాడలో అన్న సమారాధన

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని బొండాడ గ్రామంలో ఉన్న పోలేరమ్మ, మహాలక్ష్మమ్మ 48వ జాతర మహోత్సవాల సందర్భంగా సోమవారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ నెల 1వ తేదీ నుండి తొమ్మిదో తేదీ వరకు అమ్మవారి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల విశ్రాంతి అనంతరం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. సుమారు ఐదువేల మంది భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి మన్నే వరలక్ష్మీ నాగరాజు, ఆలయ ఛైర్మన్ పి.రంగరాజు, జెడ్‌పిటిసి సభ్యులు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు పాల్గొన్నారు.

'జనసేన బలోపేతానికి కృషి'

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామ స్థాయిలో జనసేన పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని జనసేన కాళ్ల మండల అధ్యక్షుడు ఎరుబండి రామాంజనేయులు (రాము)పిలుపునిచ్చారు. కాళ్లగ్రామం జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ క్రియాశీలక సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేసిన జనసేన పార్టీ వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల్లో సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభించిందన్నారు.

స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించొద్దని జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ సూచించారు. స్థానిక డిఎస్‌పి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పది ఫిర్యాదును స్టేషన్ పరిధిలోకి కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

త్వరలో గ్రామసభలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ పంట ముసాయిదా (జాబితా)లో సవరణలు ఉంటే రైతులు వెంటనే మార్పు, చేర్పులు చేసుకోవాలని ఎఒ మద్దాల జయదుర్గమాధురి తెలిపారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాల్లో రైతు సందర్శనార్థం రైతుల వివరాలను, పంట నమోదును మార్టేరు సచివాలయం-2, నెగ్గిపూడిలో ఆమె ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఆయా సచివాలయ, ఆర్‌బికెలలో విఎఎలు అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా ఎఒ మద్దాల జయదుర్గమాధురి మాట్లాడుతూ మండలంలో ఈ పంట ముసాయిదాలో మార్పు, చేర్పులు ఉంటే రైతులు వెంటనే మార్పు చేసుకోవాలని సూచించారు. మరో వారం రోజుల వ్యవధిలో గ్రామసభలు నిర్వహించి తుది జాబితా విడుదల చేసి రైతులకు యధావిధిగా అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'వచ్చే ఏడాది బిసి జన గణన చేయాలి'

పాలకొల్లు :వచ్చే సంవత్సరం కేంద్ర ప్రభుత్వం నిర్వహించే జనాభా లెక్కలు బిసిల్లో కులాల వారీగా లెక్కింపు నిర్వహించాలని ఆలిండియా బిసి ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షులు గూడూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. పాలకొల్లులో సోమవారం జరిగిన బిసి ప్రజా సంక్షేమ సంఘం నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో 27 శాతం బీసీలకు రిజర్వేషన్ కల్పిస్తున్నారన్నారు. పెరిగిన జనాభా 60 శాతానికి తగ్గట్టు బిసి రిజర్వేషన్ పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు వచ్చే సంవత్సరం జరిగే సెన్సెస్‌లో బిసిలను ప్రత్యేకంగా గణన చేసి రిజర్వేషన్ పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో గతంలో బిసి చిరు వ్యాపారులకు రాయితీతో కూడిన రుణాలు ఇచ్చేవారని, తిరిగి రుణాలు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి -పాలకోడేరు

మండలంలోని పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గ్రామాల్లో అర్హులైన విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పిహెచ్‌సి వైద్యుడు రంగం నాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు .మండలంలోని 50 పాఠశాలలో, 48 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న 8764 మందికి ఈ మాత్రలు పంపిణీ చేయనున్నామన్నారు. ఈ మాత్రలు వేసుకోవడం ద్వారా నులి పురుగును నివారించడమే కాకుండా రక్తహీనత లేకుండా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చన్నారు.

కోరుకొల్లులో పోలేరమ్మ జాతర

ప్రజాశక్తి -పాలకోడేరు

కోరుకొల్లు గ్రామ దేవత పోలేరమ్మ జాతరను సోమవారం రాత్రి ఆలయ కమిటీ గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుట్ట బొమ్మలు, కోయ డాన్సులు, ఆశాద్ర నృత్యాలు, ప్రత్యేక పూజలతో అమ్మవారి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు గ్రామస్తులతోపాటు ఆడపడుచులు జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సర్పంచి మంతిని భారతి, రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంతెన యోగేంద్ర కుమారు(బాబు) అమ్మవారిని దర్శించుకున్నారు.

'టిడిపిని గెలిపించాలి'

ప్రజాశక్తి - పెనుమంట్ర

వచ్చే ఎన్నికల్లో టిడిపి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి, టిడిపి పొలిటికల్ బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ అన్నారు. మండలంలోని కొయ్యేటిపాడు, సత్యవరం, భట్లమాగుటూరు గ్రామాల్లో సోమవారం కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగ పితాని సత్యనారాయణ విచ్చేశారు. ఈ సందర్భంగా పితాని సత్యనారాయణ మాట్లాడుతూ కార్యకర్తలు ఓటర్ లిస్టును మరోసారి సరిచూసుకోవాలన్నారు. జగన్ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు తమనంపూడి శ్రీనివాస్ రెడ్డి (బుల్లా లు), జెడ్‌పిటిసి మాజీ సభ్యులు సత్యసాయి ఆదినారాయణ రెడ్డి, కర్రీ ఈశ్వర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

'ఎస్‌సి వర్గీకరణ చేయాలి'

ప్రజాశక్తి - ఆచంట

ఎస్‌సి వర్గీకరణ బిల్లు పార్లమెంట్లో ప్రవేశ పెట్టి చట్టబద్ధత కల్పించాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి కనపాల పెద్దిరాజు కోరారు. మండలంలోని వేమవరం గ్రామంలో ఎంఎస్‌పి ఎంఆర్‌పిఎస్ ముఖ్య నాయకుల సమావేశం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దిగమర్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ ఆందోళన కరపత్రాలు సంఘ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కన్వీనర్ కనపాల పెద్దిరాజు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈనెల 28వ తేదీన ఎంఆర్‌పి నాయకులు చలో ఢిల్లీకి తరలిరావాలని, ఏప్రిల్ మూడో తేదీన విజయవాడ హైదరాబాద్ బిజెపి కార్యాలయాల ముట్టడి మహా ధర్నా జరుగుతుందని, నాలుగో తేదీన విజయవాడ, హైదరాబాద్ రాజధానుల దిగ్బంధం జరుగుతుందని తెలిపారు. ఈ ఆందోళన కార్యక్రమాలకు గ్రామాల్లో ఉన్న కార్యకర్తలు నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు మనోహర్, రాపాక సులోమాన్, సీనియర్ కనపాల వెంకటేశ్వరరావు, కొండేటి రమేష్, చదలవాడ పెద్దరాజ్‌కుమార్, కనపాల పెద్దిరాజు, లీలా కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని వన మల్లికార్జున స్వామి ఆలయం వద్ద కవయిత్రి మొల్లమాంబ 583 జయంతి వేడుకలను సభ్యులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కుమ్మరి శాలివాహనుల ఆడబడుచు, రామాయణ రచయిత్రి, తొలి తెలుగు కవయిత్రి మొల్లమాంబ అని అన్నారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, వార్డు సభ్యురాలు పొన్నపల్లి శ్రీలక్ష్మీమోహన్‌రావు, సఖినేటిపల్లి చిన్న, పొన్నపల్లి శివ, బల్ల శ్రీను పాల్గొన్నారు.

తిల్లపూడిలో 'ఇదేం ఖర్మ'

ప్రజాశక్తి - పాలకొల్లు

మండలంలోని తిల్లపూడి గ్రామంలో సోమవారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ గ్రామ నాయకులు కామిశెట్టి అయ్యప్ప నాయుడు మాట్లాడుతూ రాష్ట్రాన్ని సిఎం జగన్ అప్పుల ఊబిలో దించారని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరుతో అవినీతి రాజ్యమేలుతుందదాన్నరు. ఈ కార్యక్రమంలో నాయకులు క్లస్టర్ ఇన్‌ఛార్జి పాముల రజనికుమార్, యూనిట్ ఇన్‌ఛార్జి ఇంటి శ్రీరాముడు, తెలుగు యువత అధ్యక్షులు నీలం తాతాజీ, గ్రామ పార్టీ ప్రెసిడెంట్ బోడపాటి కాశీ విశ్వనాథం, మల్లుల వాణి గురుజీ పాల్గొన్నారు.

పేరు మార్పు ప్రకటన

పంపన వెంకటేశ్వరరావు (కొత్త పేరు) తండ్రి: వెంకట స్వామి (కొత్త పేరు), గతంలో నా పేరు బంపన శ్రీనివాసరావు (పాత పేరు) తండ్రి: బంపన స్వామి (పాత పేరు) డోర్ నెం. 8-9, పోలమూరు గ్రామం, పెనుమంట్ర మండలం, పశ్చిమ గోదావరి జిల్లా, ఆంధ్ర ప్రదేశ్ నందు నివసించుచున్నాను. **ఇప్పుడు నా పేరును బంపన శ్రీనివాసరావు (పాత పేరు) తండ్రి: బంపన స్వామి (పాత పేరు) నుండి పంపన వెంకటేశ్వరరావు (కొత్త పేరు) తండ్రి: వెంకట స్వామి (కొత్త పేరు) గా మార్చుకున్నాను.** ఈ రోజు నుండి తదుపరి అన్ని లవాదేవీల కోసం నా కొత్త పేరును ఉపయోగించవలెను. సెల్: 8179333761.